
# ఒంటరి దూరం

బి.పి.కరుణాకర్



లైబ్రరీ నుంచి ఇంటికి తిరిగి వచ్చానో లేదో నా భార్య అంది, ''ఆనందం గారికి  బాగా లేదట''. వెంటనే అతనింటికి బయల్దేర బోతోంటే, ' వచ్చే సరికి ఆలస్య మవుతుందేమో, భోజనం చేసి వెళ్లు'' అంది. ''అక్కడ ఎక్కువ సేపుండను. అర గంటలో వచ్చేస్తాను'' అని బయటకు వచ్చాను. ఆనందం నాకు నలభై సంవత్సరాల నుంచి తెలుసు. అతని ఇల్లు మా పక్క వీధిలో ఉంది. రోజూ ఏదో సమయంలో  కలుస్తూ ఉంటాం. అతను నాకంటే నాలుగైదు సంవత్సరాలు పెద్దయినా ఆరోగ్యంగా ఉంటాడు. ఏ రుగ్మతా లేదు. వారం రోజుల కిందట  ఒంగోలులో ఉంటున్న చిన్న కొడుకు దగ్గరకు వెళ్లాడు. తిరిగి వచ్చిన సంగతి నాకు తెలియదు.



# కథ

అతనికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్దవాడు పెద్దపల్లిలో, రెండోవాడు ఈ ఊళ్లో, మూడోవాడు ఒంగోలులో, కూతురు చిత్తూరులో ఉంటున్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. రెండోవాడు ప్రసన్న తప్ప మిగిలిన వాళ్లందరూ పి.జిలు చేసి లెక్చరర్లుగా పని చేస్తున్నారు. ప్రసన్నకు చదువు అబ్బలేదో, ఏమో ఇంటర్ మటుకు పూర్తి చేయగలిగాడు. జ్యూట్ మిల్లులో గుమస్తాగా పని చేస్తున్నాడు. తండ్రి దగ్గర ఉండడు. కంకఁ గుంటలో వేరేగా అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అతని భ ర్య ప్రయివేటు స్కూల్లో టీచరుగా పని చేస్తోంది.

నాకు ఆనందంలో నచ్చని విషయం ఏమిటంటే మిగిలిన ముగ్గురు పిల్లల మీద చూపించే ప్రేమలో లేష మాత్రం అయినా ప్రసన్న మీద చూపించడు. నాతో మాట్లాడేప్పుడు కూడా ప్రసన్న గురించి నిరసనగా మాట్లేడేవాడు. ప్రసన్న పొడ అతనికి కానీ, అతని భార్య విజయమ్మకు కానీ ఎంత మాత్రం గిట్టేది కాదు. ఎందుచేతనో నేను అడగలేదు. నా మటుకు నాకు ప్రసన్న నాకు మంచివాడుగా అనిపించేవాడు. నాకు తెలిసినంతవరకు అతనికి ఎటువంటి దురలవాట్లు లేవు. తనేమిటో, తన కుటుంబం ఏమిటోలా ఉండేవాడు. తల్లిదండ్రులకు పిల్లల మీద ప్రేమలో హెచ్చు తగ్గులుంటాయని ఎక్కడో చదివాను. నాకు ఒక్కతే కూతురు అవటాన నా అనుభవంలోకి రాలేదు. ఆనందం ప్రస్తుతం కను ఉంటున్న ఇంటిని తన కూతురి పేర, మిగిలి రెండు ప్లాట్లు పెద్దవాడికి, చిన్నవాడికి రెండు సంవ ్సరాల కిందట వీలునామాలో రాశాడు. ప్రసన్నకు ఏం రాయలేదు. నన్ను ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే వీలునామా రిజిస్ట్రేషన్ విష

యంలో ప్రసన్నే తండ్రికి సహాయం చేశాడు. రిజిస్టరు అయిన వీలునామా ఆనందం నాకు చూపించినపుడు పూర్తిగా చదివి నవ్వి, " మీ ప్రసన్న సంగతి పూర్తిగా మరిచిపోయావు" అన్నాను.

"వాడికేం తక్కువ? "

ప్రసన్న సంపాదన బొటాబొటిగా ఉంటుంది. ఏమీ సంపాదించుకోలేదు. ఈ విషయం ప్రసన్న దగ్గర ఎత్తినపుడు, " అంకుల్, అదంతా ఆయన స్వార్జితం . దానికోసం నేను వెంపర్లాడటం ఏం బావుంటుంది?" అన్నాడు.

ఎనిమిదిన్నరకు ఆనందం ఇంటికి వెళ్లాను. ప్రసన్న, జ్యోతి అప్పటికే అక్కడకు వచ్చి ఉన్నారు. ఆనందం మంచం మీద పడుకుని ఉన్నాడు. విజయమ్మ మంచానికి అవతల పక్కనున్న స్టూలు మీద కూర్చుని ఉంది. ఆనందం స్పృహలోనే ఉన్నాడు.

మంచం అంచున అతని పక్కనే కూర్చుని అతని చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను. శక్తి ఉన్నట్టు అనిపించడంలేదు.

"ఆనందం పిలిచాను"

కళ్లు తెరిచాడు.

"ఎలా ఉంది?"

పేలవంగా నవ్వాడు. అరవయి సంవత్సరాలు దాటినా అతని నవ్వు అందంగా ఉంటుంది. యుక్త వయసులో చక్కగా ఉండేవాడు. అతని ముఖ కవళికలు వాళ్ల పిల్లలలో ఒక్క ప్రసన్నకే వచ్చాయి.

"ఎలా ఉంది?" మళ్లీ అడిగాను.

బావున్నట్లు తలూపాడు కాని మాట్లాడలేదు. అతని చూపులు నాకు కొత్తగా ఉన్నట్టనిపించాయి. అనుమానం వచ్చి, " నన్ను గుర్తుపట్టావు కదూ ?" అడిగాను.

తలూపాడు.

" చెప్పు నేనెవరిని?"

"బసవరాజువి కదూ ' మాట స్పష్టంగా ఉంది. కాని అతను నన్ను గుర్తుపట్టలేదు. "నేను రా. పరంధామయ్యను." అన్నాను.

"లలిత ఎలా ఉంది?"

"లలిత ఎవరు?"

"నీ భార్య పేరు నువ్వే మర్చిపోతే ఎలా రా బసవరాజు?"

ఆనందం జారిపోతున్నాడు. తలెత్తి విజయమ్మ వంక చూశాను. నోటికి చీరకొంగు అడ్డం పెట్టుకుని శబ్దం కాకుండా ఏడుస్తోంది. లేచి నుంచోబోయాను. అతను నా చేయి గట్టిగా పట్టుకున్నాడు. "మంగళగిరి నుండి ఎప్పుడు వచ్చావు.?" అడిగాడు. నేను మంగళగిరి వెళ్లడం ఏమిటి? ఏమనాలో తెలియలేదు."

"అరుణ చనిపోయిందట కదా, మంచి అమ్మాయి రా" అన్నాడు.

నెమ్మదిగా నా చేయి విడిపించుకుని లేచి పంచలోకి వచ్చాను. ప్రసన్న, విజయమ్మ నా వెనకే వచ్చారు.

"ఒంగోలు నుంచి ఎప్పుడొచ్చాడు" అడిగాను.

"ఈ ఉదయం" అంది విజయమ్మ.

"ఒక్కడే వచ్చాడా"

"మా చిన్నబ్బాయి టాక్సీలో తీసుకువచ్చాడు. అక్కడ వాడింట్లో వరండా మెట్లు ఎత్తుగా ఉంటాయి. నిన్న రాత్రి మెట్లు దిగుతూ సరిగా చూసుకోలేదో ఏమో జారి కింద పడ్డాడట. అక్కడ డాక్టరుకు చూపించానన్నాడు. వెన్ను పూసకు దెబ్బ తగిలిందన్నారట, తీసుకువచ్చి ఇక్కడ వదిలేశాడు. ఉండి ఇక్కడ డాక్టరుకు చూపించడమో ఆస్పత్రిలో చేర్పించడమో చేయరా అన్నాను. అర్జెంటు పనుందని ఆయన్ని తీసుకువచ్చిన టాక్సీలో తిరిగి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకూ బాగానే ఉన్నాడు. గంట కిందటే ప్రసన్న కోసం కబురంపాను. బిడ్డ వెంటనే వచ్చాడు. ప్రసన్న మన వీధి చివర్లో ఉన్న డాక్టరు గారి దగ్గరకు వెళ్లి రమ్మన్నాడు. వస్తానన్నాడు."

"డాక్టరు గారు ఆస్పత్రిలో చేర్పించమంటే వెంటనే చేర్పించండి. " అన్నాను. ఆ డాక్టరు ఆనందానికి బాగా తెలిసిన వాడు. ఈ సమయంలో అతని క్లీనిక్ రష్‌గా ఉంటుంది. రావడానికి వీలవుతుందో లేదో అనుకున్నాను కాని పావుగంటలోనే వచ్చేశాడు.

ఆనందాన్ని పరీక్ష చేసి వెళ్తూ నాతో అన్నాడు," మహా అయితే ఒక రోజు... వెన్ను పూస విరిగిపోయింది... కిందపడ్డాక కదిలించకుండా వుండవలసింది... ఆస్పత్రికి తీసుకు వెళ్లినా ఎటువంటి లాభం వుండదు."

డాక్టరు మందులేమీ రాయలేదు. తల అడ్డంగా ఆడిస్తూ వెళ్లిపోయాడు. ప్రసన్న అందరికీ ఫోన్లు చేసి చెప్పాడు. తెలతెలవారుతుండగా ఆనందం చనిపోయాడు. అందరూ చేరుకునేసరికి మధ్యాహ్నం దాటింది. అందరూ వచ్చేలోపల కావలసినవి, చేయవలసిన పనులన్నీ ప్రసన్న, జ్యోతిలే ఏదీ తక్కువ కాకుండా చేశారు. విజయమ్మ దగ్గర లేకనో ఏమో డబ్బు ఏమీ బయటకు తీయలేదు. ఖర్చంతా ప్రసన్నే భరించాడు. అతని దగ్గర కూడా వున్నట్టు లేదు. భార్య వంటి మీదున్న నగలను తాకట్టు పెట్టి, అవీ చాలకపోతే స్నేహితులనడిగి కొంత తెచ్చాడు. కొంత వడ్డీకి కూడా తెచ్చినట్లుంది. నేనూ కొంత ఇచ్చాను. ఆనందం కాయం ఘనంగా వెళ్లిపోయింది.

ఆ రాత్రి తొమ్మిది దాటాక షామియానాలో నేనూ, ప్రసన్న కూర్చుని వున్నాం. జ్యోతి వాళ్లింటికి వెళ్లిపోయినట్టుంది. నాకూ ఇంటికి వెళ్లిపోవాలనుంది. విజయమ్మ, పెద్దవాడు, చిన్నవాడు, అమ్మాయి, కోడళ్లు, అల్లుడు, మధ్య గదిలో కూర్చుని ఏ విషయం గురించో సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. ప్రసన్నను పిలిచారో, లేక అతను వెళ్లాడో నాకు అర్థం కాలేదు. మాటలు స్పష్టంగా వినిపించడం లేదు.

"మొత్తం ఎంత ఖర్చు అయింది?" అడిగాను.

చెప్పాడు. అతని నవ్వు ఆనందం నవ్వులా మెత్తగా వుంటుంది.

"ఇరవై అయిదు వేల వరకూ అయి వుంటుంది.

అంత అతను భరించలేని మొత్తమే. గదిలోంచి ఎవరో బయటకు వచ్చి మమ్మల్ని చూసి లోపలకి వెళ్లారు. ప్రసన్న గురించి అనుకుంటాను, 'ఇంకా వెళ్లలేదు. బయట కూర్చుని వున్నాడు' అన్నారు. ప్రసన్నను లోపలకి పిలుస్తారని అనుకున్నాను. పిలవలేదు.


"మిగిలిన వాళ్లు ఎవరూ ఏమీ ఇవ్వలేదా?" నాకు ప్రసన్నతో వున్న చనువు కొద్దీ అడిగాను.

తల అడ్డంగా ఆడించి, "నేను అడగలేదు" అన్నాడు.

ప్రసన్న అడగడు. వాళ్లు ఇచ్చారని నేను అనుకోవడం లేదు. ఇవాళ అతను చేసిన అప్పులు తీరడానికి రెండు సంవత్సరాలు తేలికగా పడతాయి. తనను ఏనాడూ ప్రేమించని తండ్రి కోసమయి తలకు మించిన భారం తీసుకున్నట్టు అనిపించింది. తన తండ్రి మీద ఏర్పడిన కసిని అలా తీర్చుకున్నాడా? అయి వుండొచ్చు.

✻

## కత్రినా సంచలనం



సంచనాలకు కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకోదగిన కత్రినా ఈ సారి మరో సంచలనానికి కేంద్రబిందువు కానుంది. యాష్‌రాజ్ సినిమాకి సంబంధించిన షూటింగ్ న్యూయార్క్‌లో గత కొంతకాలంగా జరుగుతోంది. ఈ షూటింగ్‌లో కత్రినాతో పాటు హీరోలు జాన్ అబ్రహం, నీల్ నితిన్‌లు కూడా పాల్గొంటున్నారు. ఇదేమీ పెద్ద విశేషమేమీ కాదు. కాకపోతే షూటింగ్ సందర్భంగా జరిగిన రోజూ వారీ విశేషాలను కత్రినా ఎప్పటికప్పుడూ డైరీలో నోట్ చేసుకుంటోంది. ఈమెతో పాటు జాన్, నితిన్‌లు కూడా ఈ డైరీ రాస్తున్నారట. కత్రినా రాసిన డైరీలోని విశేషాలు సినిమా ప్రచారంలో భాగంగా బయటి ప్రపంచానికి తెలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విశేషాలను ఏ రూపంలో తెలియజేస్తారనిన్న విషయం ఇంకా నిర్ధారణ కాలేదు. బహుశా పుస్తక రూపంలో వెలువడవచ్చునని భావిస్తున్నారు అదే కనుక జరిగితే సినీఅభిమానులు ఎగబడి మరీ కొంటారని పరిశీలకులు అంటున్నారు.